REGD No. H 18 | విడిప్రతి 0-25 పై. | 7-10-66 శుక్రవారం

# జమీన్‌రైతు

స్థాపకులు : నెల్లూరు వెంకట్రామానాయుడు

సంపుటి 38 ] సంపాదకుడు : నెల్లూరు శ్రీరామమూర్తి [ సంచిక 40

ఎలక్షన్ కమిటీ ఎన్నిక — ఒక కాంగ్రెస్‌వాదిగా, అందులో ఒక ముఠాసమర్థుడుగాకాక, ఒక పరిశీలకుడుగా ఆలోచన

# శ్రీ బ్రహ్మానందరెడ్డికి అనుకూలించిన కారణాలు, పరిస్థితులు

**మా హైదరాబాదు విలేఖరి**

ప్రదేశ్ ఎన్నికల సంఘంపేర లేచిన దుమారం నర్దుకున్నది. వాతావరణం ప్రశాంతమైంది. కాని రాష్ట్రంలో కాంగ్రెస్ వ్యవహారాలు ప్రశాంతంగా జరిగిపోతా యనుకోవడానికి ఆధారం కనిపించడం లేదు.

బ్రహ్మానందరెడ్డి వర్గంలో సంభ్రమ సంతోషాలు వుండడంలో ఆశ్చర్యంలేదు. కాని ఎన్నికల సంఘంలో ఒక సీటును గెలుచుకున్నంత మాత్రాన 1967 ముఖ్యమంత్రి పదవికూడా చేజిక్కిందని బ్రహ్మానందరెడ్డి భావించడంలేదు. ఈవిజయాన్ని పురస్కరించుకొని ఢిల్లీలో ప్రధానితోను యితర నాయకులతోను తమవర్గం భవితవ్యాన్ని పదిలపరచుకునేటందుకు ముఖ్యమంత్రి సన్నాహాలు ప్రారంభించారు. కొత్త రైల్వేమండలం ప్రారంభోత్సవానికి ఇక్కడకు వచ్చినప్పుడు శ్రీ యస్. కె. పాటిల్‌కు తమ నివాసంలో విందునిచ్చారు. దీనికి రాజకీయ ప్రాముఖ్యత వున్నదని పరిశీలకుల భావన. శ్రీ పాటిల్, సంజీవరెడ్డికి కావలసిన మిత్రుడు. కాని ఆయన ఇటీవల ప్రధానికి చాలాసన్నిహితంగా వున్నారు.

తిరుగుబాటు వర్గంలో నిరాశా నిస్పృహాలు లేవు. ఎన్నికలు జరిగిననాటిరాత్రి వీరంతా సమావేశమైనప్పుడు, సంజీవరెడ్డిగారు మొదటినుంచీ, నాయకత్వాన్ని చేపట్టక మధ్యవర్తిగా వ్యవహరించడం వల్లనే తమకు ఓటమి కలిగిందని ఆనాడు మాట్లాడిన పిడతల రంగారెడ్డి ప్రభృతులు చెప్పారు. మరునాడు వి. సి. సుబ్బారెడ్డి ఈ భావాలనే విలేఖరులతో మాట్లాడుతూ వ్యక్తంచేశారు. అంతమాత్రంతో ఆవర్గంలో విభేదాలు వచ్చాయనుకోకూడదు. వీరి భవిష్యత్తుకూ, సంజీవరెడ్డి భవిష్యత్తుకు అవినాభావ సంబంధమేర్పడింది. ఇది వుభయులకు తెలును.

ప్రదేశ్ కాంగ్రెస్ ఎన్నికల సంఘానికి సెప్టెంబరు 29 న జరిగిన ఎన్నిక ఇటీవల అపూర్వమైన సంచలనాన్ని ఆంధ్ర రాజకీయాల్లో కలిగించింది. ఇటీవలనేనని ఎందుకు అనవలెనంటే, ఇంతకుపూర్వం పదిసంవత్సరాలక్రితం, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్‌పార్టీ నాయకత్వానికై సంజీవరెడ్డి, గోపాలరెడ్డి మధ్య జరిగిన పోటీ, అంతకుపూర్వం 1951లో ప్రదేశ్ కాంగ్రెస్ సంఘాధ్యక్ష పదవికై ఆచార్యరంగా, సంజీవరెడ్డి మధ్య జరిగిన పోటీకూడా ఈ విధంగానే మహత్తరమైనవి, ఆంధ్ర కాంగ్రెస్ రాజకీయాల్లో నూత్న అధ్యాయాలను ప్రారంభించినట్టివని.

ఈ విలేఖరి మూడు నాలుగు మాసాల క్రితం, బ్రహ్మానందరెడ్డి, సంజీవరెడ్డిమధ్య, ఆంధ్రకాంగ్రెస్‌లో పెత్తనంకోసం కలిగిన తగాదాగురించి వ్యాఖ్యానించిన సందర్భంలో క్రితం నాలుగైదు సంవత్సరాల నుంచి ఆంధ్రకాంగ్రెస్ రాజకీయాలు, "అనాంధ్ర" ధోరణిలో జరుగుతున్నాయని వ్రాయడం తటస్థించింది. సహజంగా ఆవేశపరులైన ఆంధ్రులు ఒకేఒక నాయకుని క్రింద పడునగా కొన్ని సంవత్సరాలు నడుచుకొనడం, రాజకీయ వివాదాలు తిరుగుబాట్లు లేకుండా వుండడం అరుదు. అలాంటిది క్రితం మూడు నాలుగు సంవత్సరాలు కాంగ్రెస్ వ్యవహారాలు సాఫీగా జరిగిపోతూ వుండడం అసహజమనిపించింది. నిజానికి అసహజస్థితి 1964 చివరి భాగంనుంచే అదృశ్యం కానారంభించింది. కాని బయట పడడానికి రెండు

—కొరవ 7వ పేజీలో




రాయల్ యన్‌ఫీల్డు మోటార్‌సైకిళ్లు

మేము రాయల్ యన్‌ఫీల్డు మోటారుసైకిళ్ళు (3.5 బుల్లెట్ మరియు 1.75 షెర్పా) మరియు ఫంటాబులస్ స్కూటర్లకు నియమింపబడిన డీలర్లము. మావద్ద ప్రైవాటికి స్వచ్ఛమైన విడి సామానులు దొరకును. మరియు వాటిని రిపేరు చేయుటకు ప్రత్యేకముగా శిక్షణ పొందిన పనివారలు కలరు.

**అతిత్వరగా రిపేరులు చేసి యివ్వగలమని తెలుపుచున్నాము.**

యం. జి. బ్రదర్సు,

పొగతోట (ఫోన్ : 306) నెల్లూరు.

నెల్లూరు జిల్లాలో కాంగ్రెస్

# దరఖాస్తుల దడబడలు — అభ్యర్థులకై అన్వేషణలు

జిల్లాలో దరఖాస్తులవ్యవహారం దడబడలుగావుంది. కొందరు హైదరాబాదులోనే వేశారు; కొందరు జిల్లాకాంగ్రెస‌అధ్యక్షునివద్ద యిచ్చారు; కొందరు పోస్టులో పంపారు; కొందరు ఆలోచిస్తున్నారు; కొన్ని నియోజకవర్గాల అభ్యర్థులకై అన్వేషణ జరుగుతున్నది. మొత్తానికి దరఖాస్తులు స్పష్టంగా ముఠాల పరంగానే జరుగుతున్నవి.

గూడూరుకు శ్రీ పెళ్లేటి గోపాలకృష్ణారెడ్డి, అల్లూరుకు (బుచ్చి) శ్రీమతి విమలాదేవి, కావలికి డాక్టరు తోట జయరాం, దర్శికి జిల్లాపరిషత్తు మాజీ వైస్‌ఛైర్మన్ శ్రీ గోరంట్ల శ్రీరాములు దరఖాస్తులువేశారు. ఇవి వూహించనివి.

ఉత్తర పార్లమెంటుకు శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారొక్కరే దాఖలు చేశారు. దక్షిణ పార్లమెంటుకు (రిజర్వుడు) శ్రీ కోరాబత్తిన చిన్నయ్య, శ్రీ డి. కామాక్షయ్య, శ్రీ ఎం. నానాదాస్‌గారలు వేశారు. అంజనప్పగారి దరఖాస్తు వుండనేవుంటుంది.

ప్రదేశ్ కాంగ్రెస్ ఎలక్షన్ కమిటీ ఎన్నికలో నిమగ్నులైవున్నందువల్ల కాబోలు, జిల్లాలో ఇరువర్గాలవారు ఇప్పుడు హడావిడిగా అభ్యర్థులను వెతుక్కుంటున్నారు. శ్రీ ఎ. సి. సుబ్బారెడ్డిగారు రెండురోజుల పాటు నెల్లూరులోవుండి, సమాలోచనలు జరిపి, సలహాలిచ్చిపోయినట్లుంది. ఆనం సంజీవరెడ్డిగారు అవిరామంగా తిరుగుతున్నారు. జిల్లాకాంగ్రెస్‌అధ్యక్షుడు శ్రీ నల్లపరెడ్డి చంద్రశేఖరరెడ్డిగారునరే, శతావధానంచేసి, ముఖ్యమంత్రి దర్శనార్థం మద్రాసుకు పోయివున్నారు. శ్రీనివాస మహల్, కాంతి గుసగుసలతో, దర్పంతో, కబుర్లతో సందడిగావున్నాయి. ఒక్క బి. సి. కొండయ్యగారు మాత్రం నిశ్చింతగా, నిండుగా కనబడుతున్నారు. ఆనం సంజీవరెడ్డిగారి మాటలువిన్నా కొండయ్యగారిని చూచినా జిల్లాలో దరఖాస్తుల సందడే లేదనిపిస్తుంది.

—కొరవ 7వ పేజీలో

ఈ రోజే చూడండి

నెల్లూరు విజయమహల్లో

విజయవంతంగా 2-వవారం ప్రదర్శింపబడుచున్నది.

నవకేతన్ ఇంటర్నేషనల్ ఫిలుమ్స్ (పూర్తి కలర్)

గైడ్ (హిందీ)

(ప్రింటింగ్ - ప్రాసెసింగ్ న్యూయార్క్)

ప్రపంచదృష్ట్యా పేరెన్నికగని వేనోళ్ల కొనియాడబడుచున్న చిత్రం. ఈ చిత్రములో సెట్టింగులు - దృశ్యములు మిమ్ములను ఆశ్చర్యచకితులను చేయడంలో సందేహములేదు. వీనులకింపైన సంగీతం, అద్భుతమయిన నాట్యప్రదర్శనలతో నిండియున్నది.

కోటి రూపాయల వ్యయంతో తీసిన ఈ చిత్రాన్ని చూచే అవకాశం జారవిడువకండి.

దేవానంద్ - వహీదారహమాన్ నటించారు.

